క్లుప్తంగా

డిగ్రీ కళాశాల అభివృద్ధి కమిటీ సమావేశం



తుని డిగ్రీ కళాశాలలో అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ లలిత

తుని రూరల్: వి.కొత్తూరులోని తుని ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాల ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్ కమిటీ నూతన కమిటీని ఏర్పాటు చేశారు. శనివారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ లలిత అధ్యక్షతన నూతన కమిటీ నియామక ప్రక్రియ పూర్తి చేసి, సమావేశం నిర్వహించారు. కాతా గోపాలకృష్ణ, పెనుగొండ కామరాజు, చిట్టిబోయిన రామకృష్ణ, తిరుపతి మహంతి వెంకట శ్రీనివాస్, డాక్టర్ ఏవీ. రమణ, వెలగా ఈశ్వరరావు, తమరాన సత్యనారాయణ సభ్యులుగా ఎన్నికయ్యారు. వైస్ ప్రిన్సిపాల్ డి.లక్ష్మి, అధ్యాపకులు ఎం.శ్రీనివాస్, అల్లు పుష్పలత, కళాశాల సూపరింటెండెంట్ ఎస్.పుష్పవేణి సమావేశంలో పాల్గొని కళాశాల అభివృద్ధిపై చర్చించారు.

చెట్ల నరికివేతపై విచారణ



తాళ్లూరు పంచాయతీ కార్యాలయం వద్ద విచారణ చేస్తున్న ఎస్సై, సిబ్బంది

గండేపల్లి: మండలంలోని తాళ్లూరులో చెట్ల నరికివేత ఘటనపై శనివారం ఎస్సై యువి శివ నాగబాబు విచారణ చేపట్టారు. గ్రామంలోని పంచాయతీ స్థలంలో కొన్నేళ్లుగా పెంచుతున్న చెట్లను ఇటీవల గ్రామానికి చెందిన గుర్తు తెలియని వ్యక్తులు నరికి తరలించుకుపోయారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి షకీలా గండేపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సై విచారణ జరిపారు. నరికి తరలించిన చెట్లను గుర్తించి ట్రాక్టర్ సహాయంతో వాటిని తీసుకువచ్చి గ్రామ సర్పంచ్ శీలామంతుల వీరబాబు, తదితరుల సమక్షంలో పంచాయతీ కార్యదర్శికి అప్పగించినట్టు తెలిపారు.

కార్మికుల సంక్షేమానికి కృషి



భవన నిర్మాణ కార్మికులతో రామ్‌కుమార్

ఏలేశ్వరం: కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తామని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ అన్నారు. స్థానిక ఆదర్శ భవన నిర్మాణ కార్మికులతో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. అనంతరం కార్మిక భవనానికి తన సొంత ఖర్చులతో విద్యుత్ కనెక్షన్ వేయించేందుకు కొబ్బరికాయ కొట్టారు. కార్యక్రమంలో పార్టీ నేతలు కురాకుల రాజా, నీలి సురేష్, గరికి నాగు, కరెడ్ల ఏసుబాబు, బండారు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

అన్నసమారాధన

కిర్లంపూడి: మండలంలోని పాలెం గ్రామంలో వేంచేసిన ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద శనివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. మాఘమాసాన్ని పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పలు రకాల వంటకాలతో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. స్థానిక, పరిసర గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు.

శివకేశవుల విగ్రహాలకు క్షీరాధివాసం



ఇర్రిపాకలో కోటిలింగేశ్వరస్వామి విగ్రహానికి క్షీరాధివాసం నిర్వహిస్తున్న పండితులు

జగ్గంపేట: మండలంలోని ఇర్రిపాకలో శివకేశవుల విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు వైభవంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా శనివారం కోటిలింగేశ్వరస్వామి, వేంకటేశ్వరస్వామి విగ్రహాలకు క్షీరాధివాసం నిర్వహించారు. వేంకటేశ్వరస్వామికి పద్మ పుష్పాలతో యంత్రార్చన, పలు హోమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కుటుంబ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు స్వామివార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

ఏలేశ్వరం: మండలంలోని పెద్దనాపల్లిలో శనివారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మద్దతుగా ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి ప్రచారం చేశారు. గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల, సచివాలయాల్లో పట్టభద్రుల ఓటర్ల కలిసి ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో బుద్దా ఈశ్వరరావు, సుంకర సత్తిబాబు పాల్గొన్నారు.

• భానుడి భగభగలు



ఎస్.అన్నవరం వద్ద జాతీయ రహదారిపై తగ్గిన వాహనాల రద్దీ

తుని రూరల్: వేసవి కాలం ప్రారంభంలోనే ఎండలు మండిపోతున్నాయి. నియోజకవర్గంలో శుక్రవారం గరిష్ఠంగా 36 డిగ్రీలు, కనిష్ఠంగా 19 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. శనివారం గరిష్ఠంగా 34 డిగ్రీలు, కనిష్ఠంగా 19 డిగ్రీలు ఉష్ణోగ్రతలు నమోదైనట్టు వాతావరణశాఖ అధికారులు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరగనున్నాయి. ప్రస్తుతం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 వరకూ ఎండ ప్రభావం ఉంటోంది. సాయంత్రం ఆరు గంటల తర్వాత వేడి తీవ్రత తగ్గుముఖం పట్టి చల్లగా ఉంటుండడంతో ప్రజలు ప్రశాంతంగా నిద్రిస్తున్నారు. మధ్యాహ్నం సమయంలో ఎండ వేడిమితో ప్రధాన రహదారులు, 16వ నంబరు జాతీయ రహదారిపై వాహనాల రద్దీ స్వల్పంగా తగ్గుతోంది.

స్పందించి.. వివరాలు సేకరించి..

- కోదాడలో పర్యటించిన వ్యవసాయాధికారులు
- దెబ్బతిన్న వరి పొలాల పరిశీలన
- వివరాల నమోదు

సాక్షి ఇంపాక్ట్



కోదాడలో దెబ్బతిన్న వరి పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

తొండంగి: మండలంలోని కోదాడలో రైతులు సాగు చేసిన రబీ వరిచేలు నాట్లు వేసిన కొద్దికాలానికే చనిపోయాయి. దీనిపై 'ఆదిలోనే రబీ ఆశలు ఆవిరి' అనే శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి జిల్లా వ్యవసాయశాఖాధికారి ఎస్.విజయ్‌కుమార్ స్పందించారు. మండల వ్యవసాయ శాఖాధికారి ఎస్.నరసింహం, ఇతర అధికారులతో కలసి శనివారం కోదాడలో పర్యటించారు. బాధిత రైతులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మొదటి దఫా వేసిన వరిపంట దెబ్బతినడంతో మళ్లీ రెండోసారి వరి నాట్లు వేయించామని రైతులు తెలిపారు. సాగుకు వినియోగించిన విత్తనాలు, ఇతర వివరాలను జేఏఓ విజయ్‌కుమార్ నమోదు చేసుకున్నారు. మంచు, అధిక ఉష్ణోగ్రతలను తట్టుకోవడంలో మొక్క తల్లివేరు సామర్థ్యం తగ్గడంతో పంట దెబ్బతినే అవకాశం ఉందని, అరుదుగా ఇలాంటివి జరుగుతాయని తెలిపారు. రెండోసారి వేసిన పంటలో చేపట్టాల్సిన సస్య రక్షణ చర్యలను వివరించారు. దీనిపై వ్యవసాయశాఖ పరిశోధన కేంద్రానికి సమాచారం అందిస్తామని తెలిపారు.

నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని వినతి

పీబీసీ పరిధిలో సాగు చేసిన రబీ వరిపొలాలకు నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని ఏవీ నగరం, కోదాడ తదితర ఆయకట్టు ప్రాంతాల రైతులు జిల్లా వ్యవసాయశాఖాధికారి విజయ్‌కుమార్‌ను కోరారు. దీనిపై స్పందించిన ఆయన వెంటనే ఇరిగేషన్ ఎస్ఈ శేషగిరిరావుతో ఫోన్‌లో మాట్లాడారు. పీబీసీలో ప్రస్తుతం ఉన్న నీటి నిల్వలు ఈ నెలాఖరు వరకూ సరిపోతాయని, ఎద్దడి వస్తే గొల్లప్రోలు వద్దనున్న ఆర్ఆర్‌బీ ట్యాంకు ద్వారా నీటిని కోదాడ ఉప్పు ట్యాంకుకు పంపి ఆయకట్టు పొలాలకు అందిస్తామని తెలిపారు. రైతులకు ఎటువంటి ఇబ్బంది రాకుండా చూడాలని, ఇబ్బంది వస్తే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని మండల వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖాధికారి ఎస్.నరసింహం, గ్రామసచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ధ్వజస్తంభం ప్రతిష్ఠ

గండేపల్లి: ధ్వజస్తంభం నిర్మాణంతో ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోట నరసింహం పేర్కొన్నారు. మండలంలోని మురారి వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద శనివారం ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠాపన కార్యక్రమం వైభవంగా జరిగింది. తోట నరసింహం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ యువ నాయకుడు తోట రాంజీ, ఎంపీపీ చలగళ్ల దొరబాబు, మురారీ మాజీ సర్పంచ్ ఉండవిల్లి బులిరాజు, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ రామకుర్తి మూర్తి, పార్టీ నేతలు కోర్పు దుర్గాప్రసాద్, గద్దే వీరన్న చౌదరి తదితరులు పాల్గొన్నారు.

230 మంది రక్తదానం



తునిలో రక్తదానం చేస్తున్న దాతలు

తుని: తలసేమియా వ్యాధితో బాధపడుతున్న పిల్లల కోసం డెక్కెన్ కెమికల్ కంపెనీకి చెందిన 230 మంది ఉద్యోగులు రక్తదానం చేశారని కంపెనీ వైస్ ప్రెసిడెంట్ పీవీఎస్ఎస్ రాజు తెలిపారు. స్థానిక మమతా మల్టీ స్పెషల్ ఆసుపత్రిలో మదర్ బ్లడ్ బ్యాంకు, వైఎస్సార్ బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. రక్తదానం చేసిన ఉద్యోగులను అభినందించారు. రక్తదాతలకు పౌష్టికాహార కిట్లు అందజేశారు.

ఒత్తిడి లేని జీవన శైలి అవసరం

గండేపల్లి: ఆరోగ్యకరమైన శరీరానికి ఒత్తిడిలేని జీవన శైలి ఎంతో అవసరమని డాక్టర్ సచిన్ పరబ్ అన్నారు. మండలంలోని సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం బీటెక్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ది సీక్రెట్ ఆఫ్ అల్టిమేట్ లివింగ్ అనే అంశంపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత జీవన శైలిలో ఒత్తిడిని తగ్గించుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆదిరెడ్డి రమేష్, డీన్ వైకేఎస్ సుబ్బారావు, పి.రవి కుమార్, సి.రాజశేఖర్ రెడ్డి, జి.కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

ముగిసిన వర్క్‌షాప్

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలలో మూడు రోజుల పాటు జరిగిన వర్క్‌షాప్ శనివారంతో ముగిసినట్టు కళాశాల చైర్మన్ పి.కృష్ణారావు తెలిపారు. కంప్యూటర్ సైన్స్, ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో వెబ్ అప్లికేషన్స్ డెవలప్‌మెంట్ విత్ డిజైన్ థింకింగ్ ఇన్నోవేషన్స్ అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. బ్రెయినో విజన్ సొల్యూషన్స్ ప్రైవేటు లిమిటెడ్ అకాడమీకి చెందిన నారాయణస్వామి, అమర్నాథ్, మోహన్ విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించినట్టు పేర్కొన్నారు.

ప్రజాస్వామ్యంలో అధికారం శాశ్వతం కాదు

మాజీ మంత్రి తోట నరసింహం

గండేపల్లి: ప్రజాస్వామ్యంలో అధికారం శాశ్వతం కాదని, అది ఉన్నవారు ప్రతిపక్షాలపై దాడి చేయడం సరికాదని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోట నరసింహం అన్నారు. మండలంలోని గండేపల్లి సర్పంచ్ రుత్తల లలిత భర్త గణేష్‌పై ఇటీవల గ్రామానికి చెందిన కొందరు దాడి చేశారు. కాగా శనివారం తోట నరసింహం సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శించి దాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రజా ప్రయోజనాల కోసమే పనిచేస్తుందన్నారు. గ్రామంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించుకునేందుకు కొందరు చేస్తున్న ప్రయత్నాలను గణేష్‌పై ఫొటోలు తీశారన్నారు. ఈ కక్షతో ఆయనపై అన్యాయంగా దాడిచేయడం సరికాదని హితవుపలికారు. ఇటువంటి దాడులు పునరావృతమైతే సహించేదిలేదన్నారు. కార్యక్రమంలో తోట రాంజీ, ఎంపీపీ చలగళ్ల దొరబాబు, పార్టీ మండల అధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ రామకుర్తి మూర్తి, దోనాదుల కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



గండేపల్లిలో సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ మంత్రి తోట నరసింహం, నాయకులు

మహాశివరాత్రి ఉత్సవాలకు రాట ముహూర్తం

ఏలేశ్వరం: మండలంలోని సిరిపురంలో మహాశివ రాత్రి ఉత్సవాలకు శనివారం శ్రీకారం చుట్టారు. గ్రామంలోని పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరా స్వామి ఆలయం వద్ద పందిరి రాట వేసి ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. తొలుత ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చకుడు వై.రామకృష్ణమూర్తి స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 22న స్వామి, అమ్మవార్లను పెండ్లికుమారుడు, పెండ్లి కుమార్తెను చేయుట, 23న స్వామివారి కల్యాణం నిర్వహిస్తారు. 26న మహాశివ రాత్రి సందర్భంగా స్వామివారికి పంచామృతాభిషేకాలు, విశేష పూజలు నిర్వహించనున్నారు. 27న గ్రామోత్సవం, పండిత సదస్యం, 28న త్రిశూల స్నానం, శ్రీపుష్పయాగంతో ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



సిరిపురం శివాలయం వద్ద పందిరి రాట వేస్తున్న భక్తులు

కన్నులపండువగా శోభాయాత్ర

కోటనందూరు: మండలంలోని పాతకొట్టాంలో సీతారామచంద్రస్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవం శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. దీనిలో భాగంగా సప్తనది జలాలను నింపిన కలశాలతో మహిళలు గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం స్వామివారికి జలాభిషేకం, పంచామృతాభిషేకం, హోమం, వార్షిక కల్యాణం నిర్వహించారు. స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు గ్రామంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు వేలాదిగా తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం భారీ అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, వేషధారణలు, కోలాటం భక్తులను అకట్టుకున్నాయి. ఆలయ ధర్మకర్త యడ్ల చెల్లారావు, కమిటీ సభ్యులు మైలవరపు అప్పారావు, మైలవరపు నరశింగరావు, యడ్ల శ్రీనివాసు, యడ్ల నాగేశ్వరరావు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



పాతకొట్టాంలో శోభాయాత్ర నిర్వహిస్తున్న మహిళలు

ప్రభుత్వ మార్గదర్శకాలు పాటించాలి

ప్రత్తిపాడు: రాష్ట్రంలో బర్డ్ ఫ్లూ వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో చేపల పెంపకందారులు ప్రభుత్వ మార్గదర్శకాలు పాటించాలని ప్రత్తిపాడు పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ చిక్కం బాలచంద్ర యోగేశ్వర్ సూచించారు. మండలంలోని చినశంకర్లపూడిలో చేపల పెంపకందారులతో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోళ్లకు వ్యాపించిన బర్డ్ ఫ్లూ వ్యాధిని నివారించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. దీనిపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసం లేదన్నారు. వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. చేపలకు మేతను ఎప్పుడూ కొనుగోలు చేస్తున్న వారి వద్దే కొనుగోలు చేయాలన్నారు. కొత్త వ్యక్తుల నుంచి మేత కొనుగోలు చేయరాదన్నారు. చనిపోయిన కోళ్ల గాని, వాటి అవశేషాలు గాని చేపలకు మేతగా వినియోగిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. ఆయన వెంట ధర్మవరం ప్రభుత్వ పశువైద్యశాల వైద్యాధికారిణి సుంకర వరలక్ష్మి, పంచాయతీ సిబ్బంది కస్తూరి తేజాప్రతాప్ తదితరులు ఉన్నారు.

వివరాలు నమోదు చేసుకోవాలి

శంఖవరం: గ్రామాల్లో భూమి కలిగిన అన్నదాతలు రైతు సేవాకేంద్రాలకు వెళ్లి తమ వివరాలను ఏపీ ఫార్మర్ రిజిస్ట్రేషన్ వెబ్ సైట్లో నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.విజయ్‌కుమార్ సూచించారు. మండలంలోని నెల్లిపూడి రైతు సేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల తమ భూమి వివరాలు నమోదు చేయించుకోవడం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాలకు అర్హులు అవుతారన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ పి.గాంధీ, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

సీబీసీఎన్‌సీ ఆస్తుల రక్షణకు సీబీఐ విచారణ

మహాసభలో పాలకవర్గం తీర్మానం

తుని: బాప్టిస్ట్ చర్చిల ఆస్తుల రక్షణ కోసం సీబీఐ విచారణ వేయాలంటూ ప్రభుత్వాన్ని కోరతామని సీబీసీ ఎన్‌సీ మహాసభ అధ్యక్షుడు డాక్టర్ విజయకుమార్ తెలిపారు. తుని స్కాట్ మెమోరియల్ బాప్టిస్ట్ చర్చిలో శనివారం ఉత్తర సర్కారుల బాప్టిస్ట్ మహాసభ విజయకుమార్ అధ్యక్షతన జరిగింది. అవనిగడ్డ నుంచి సోంపేట వరకు సీబీసీఎన్‌సీ ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మహాసభ అధ్యక్షుడు విజయకుమార్ మాట్లాడుతూ సీబీసీఎన్‌సీకి రూ.40 వేల కోట్ల విలువ చేసే ఆస్తులు ఉన్నాయని, వీటికి కొంతమంది వ్యక్తులు తూట్లు పొడిస్తున్నారన్నారు. సీబీఐ విచారణ జరిపించి మైనార్టీ ఆస్తులను రక్షించాలని ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఆమోదించారు. మహాసభ కార్యదర్శి జి.జోసెఫ్ మాట్లాడుతూ మైనార్టీ పాఠశాలలు, వేదాంత కళాశాలలు కలిగిన సంస్థను ప్రభుత్వం కాపాడాలన్నారు. తునిలో బైబిల్ ట్రైనింగ్ స్కూల్ ఆస్తుల రక్షణకు చర్యలు తీసుకుంటున్న సీబీసీఎన్‌సీ కోశాధికారి బీజేవీ ప్రసాద్‌ను కస్టోడియన్‌గా నియమించడం అభినందనీయమని సంఘం పెద్దలు డి.శ్యాంసన్ అన్నారు. అవని గడ్డ నుంచి సోంపేట వరకు ఉన్న సీబీసీఎన్‌సీ ఆస్తులన్నీ ట్రస్ట్ పరిధిలోనే ఉన్నాయని విజయకుమార్ తెలిపారు. బోర్డు సభ్యుల సూచనలు, సలహాలను పరిగణలోకి తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సీబీసీ ఎన్‌సీ సభ్యులు పాల్గొన్నారు.



సీబీసీఎన్‌సీ సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

జగ్గంపేట: మండలంలోని గుర్రంపాలెం గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ నాగులపల్లి రాంజీ కుటుంబానికి జగ్గంపేట లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆర్థిక సాయం అందించింది. లారీ డ్రైవర్ రాంజీ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో లారీ ఓనర్స్ అసోసియేషన్ తరపున బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని నిర్ణయించి రూ.53 వేలు సేకరించారు. ఈ మొత్తాన్ని శనివారం సంఘ గౌరవాధ్యక్షుడు మారిశెట్టి రాధాకృష్ణ, అధ్యక్షులు దవులూరి ఈశ్వరరావు బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు ఎస్.రాంబాబు, కేవీ వర్మ, సుంకర శ్రీను తదితరులు పాల్గొన్నారు.



గుర్రంపాలెంలో బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న అసోసియేషన్ సభ్యులు

బాలికల సంరక్షణకు ప్రత్యేక చట్టాలు

ప్రత్తిపాడు రూరల్: మహిళలు, బాలికల సంరక్షణకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయని స్థానిక ఎస్సై ఎస్.లక్ష్మీకాంతం అన్నారు. మండలంలోని ఒమ్మంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం మహిళా చట్టాలు, హక్కులు, బాలికల రక్షణ, సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఆకతాయిలు మహిళలు, చిన్నారుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే తక్షణమే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై మహిళా పోలీసులు అవగాహన కల్పించారు. విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛమేవ జయతే..

- పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం
- ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు
- గ్రామాల్లో స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ ర్యాలీలు

కిర్లంపూడి: పరిశుభ్రతపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ హెచ్.హరికృష్ణ సూచించారు. జగపతినగరం పంచాయతీ శ్రీరామ్‌నగర్‌లో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. పారిశుధ్య పనులను ఈఓపీఆర్డీ సత్యప్రసాద్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమన్నారు. డ్రైనేజీల్లో మురుగును తొలగించి, బ్లీచింగ్ చల్లాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ గుడాల రాంబాబు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించాలి

ఏలేశ్వరం: తడిచెత్త, పొడిచెత్తలను వేర్వేరుగా సేకరించాలని ఎంపీడీఓ కేవీ సూర్యనారాయణ సూచించారు. స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా లింగంపర్తిలో శనివారం తడి, పొడిచెత్తల సేకరణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్వచ్ఛాంధ్రపై సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ పారిశుధ్య సిబ్బంది తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించాలన్నారు. ఇళ్ల వద్దే యజమానులు తడి, పొడి చెత్తలను వేరుగా ఉంచాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివాస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

జగ్గంపేట: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్, పోలీసు కార్యాలయాల్లో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. సీహెచ్‌సీలో సూపరింటెండెంట్ డాక్టర్ ప్రణీత్ ఆధ్వర్యంలో వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది ఆసుపత్రి పరిసరాలను శుభ్రపరిచారు. తడి, పొడి చెత్తల సేకరణ, పరిసరాల పరిశుభ్రతతో కలిగే ప్రయోజనాలను డాక్టర్ ప్రణీత్ సిబ్బందికి వివరించారు. స్థానిక పోలీసు సర్కిల్ కార్యాలయం పరిసరాలను సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, ఎస్సై రఘునాథరావు, పోలీసు సిబ్బంది శుభ్రం చేశారు.

గండేపల్లి: గ్రామంలో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా తడి, పొడి చెత్తల నిర్వహణపై పారిశుధ్య సిబ్బందికి అవగాహన కల్పించినట్టు ఎంపీడీఓ నాతి బుజ్జి తెలిపారు. అనంతరం మురారిలో పర్యటించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఓ చంద్రరావు, ఏపీఓ గంగాభవాని, ఈసీ రమేష్ పాల్గొన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎస్సై యువి శివ నాగబాబు, సిబ్బంది శుభ్రం చేశారు.

ప్రత్తిపాడు: స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ప్రత్తిపాడు మండల మహిళా సమాఖ్య కార్యాలయాన్ని పరిశుభ్ర పరిచారు. శనివారం ఏపీఎం వై.వెంకట్ ఆధ్వర్యంలో వెలుగు సిబ్బంది కార్యాలయంలోని దస్త్రాల దుమ్ము దులిపారు. కార్యాలయ ఆవరణలో పెరిగిన పిచ్చి మొక్కలు, తుప్పలను తొలగించారు. అనంతరం కార్యాలయ సిబ్బందితో ఏపీఎం వై.వెంకట్ స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించారు.

తుని: స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యాక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ వెంకట్రావు కోరారు. శనివారం పట్టణంలో తడి, పొడి చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన కల్పించారు. చెత్త సేకరణ, కంపోస్టు ఎరువు తయారీపై పారిశుధ్య కార్మికులకు పలు సూచనలు చేశారు. ఇంచార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ షేక్ సలీం, శానిటేషన్ కార్యదర్శులు, మెప్మా అధికారి శ్రీదేవి, కమ్యూనిటీ ఆర్గనైజర్లు, రిసోర్స్‌పర్సన్లు పాల్గొన్నారు.



తునిలో తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన కల్పిస్తున్న కమిషనర్ వెంకట్రావు



లింగంపర్తిలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీడీఓ సూర్యనారాయణ, సిబ్బంది



జగ్గంపేటలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ పరిసరాలను శుభ్రం చేస్తున్న డాక్టర్లు, సిబ్బంది



మురారిలో పరిసరాల పరిశుభ్రతపై సూచనలు చేస్తున్న ఎంపీడీఓ

ప్రజలు భాగస్వాములు కావాలి

గోకవరం: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. మండలంలోని అచ్యుతాపురంలో శనివారం ఆమె పర్యటించారు. గ్రామంలో ఇంకుడు గుంతలు నిర్మాణ పనులను ప్రారంభించారు. డ్రైనేజీలు నిర్మించడానికి వీలులేని వీధుల్లో ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని సూచించారు. ఇందు కోసం ఒక్కొక్క ఇంకుడు గుంతకు రూ.6 వేలు చెల్లిస్తున్నట్టు తెలిపారు. ఇంకుడు గుంతలు నిర్మించుకోవడం ద్వారా పారిశుధ్యం మెరుగుపడుతుందన్నారు. జిల్లాలో 3650 సోప్ పిట్స్ కేంద్రాల నిర్మాణానికి చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో డ్వామా పీడీ ఎ.నాగేశ్వరరావు, ఎంపీడీఓ గోవిందు, తహసీల్దార్ సాయిప్రసాద్, ఈఓపీఆర్‌డీ రాజేశ్వరరావు, ఉపాధి ఏపీఓ అప్పలరాజు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



అచ్యుతాపురంలో ఇంకుడు గుంతల నిర్మాణాలను ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రశాంతి